క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి

పెనుబల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్ అన్నారు. బుధవారం కుప్పెనకుంట్ల బీసీ బాలికల హాస్టల్‌ని పరిశీలించి మాట్లాడారు. గతంలో ఎన్నడు లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం డైట్, క్యాస్మోటిక్ చార్జీలు అందిస్తున్నందున. ప్రతీ విద్యార్థికి మంచి చదువుతో పాటు, నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వెంకటేశ్వరరావు, విశ్వనాద్, నీరజ, కోటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, సీతారామారావు, కరీముల్ల, కిరణ్, మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్‌తో కూలీల కొరతకు చెక్



డ్రమ్‌సీడర్‌తో విత్తనాలు చల్లుతున్న ఏఓ బాలాజీ, ఏఈఓ హర్ష

కొణిజర్ల: డ్రమ్ సీడర్‌తో వరి విత్తనాలు వేసుకోవడం వల్ల రైతులు కూలీల కొరతను అధిగమించవచ్చని మండల వ్యవసాయాధికారి డి.బాలాజీ అన్నారు. బుధవారం మండలంలోని పల్లిపాడులో రైతులు డ్రమ్‌సీడర్‌తో వరి విత్తనాలు చల్లే కార్యక్రమాన్ని ఆయన ఏఈఓ హర్షతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారు పెంచి నాటు వేసే ప్రక్రియలో ఎకరానికి 30కేజీల విత్తనాలు అవసరమైతే డ్రమ్‌సీడర్‌తో కేవలం 10 నుంచి 12 కేజీల విత్తనాలు మాత్రమే సరి పోతాయన్నారు. ఎన్ఎస్పీ కింద వరిసాగు చేసే రైతులు దీర్ఘకాలిక రకాలు సాగు చేయెుద్దన్నారు. ఆగస్టు 31 నాటికి వరి నాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నానో యూరియా వాడాలి

పెనుబల్లి: సాంప్రదాయిక యూరియా పోషక సామర్థ్యం 30శాతం ఉంటే, నానో యూరియా సామర్థ్యం 90శాతం ఉంటుందని ఏఓ ఏవీఎస్ ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని గణేషన్‌పాడు పంచాయతీలో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు హర్ష, నందిని, సమంత, శ్రీనివారావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మధిర: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మధిర టౌన్ ఎస్సై కిషోర్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీనిధి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులకు, ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించి నేరాల నియంత్రణకు కృషి చేయాలని కోరారు. సోషల్ మీడియాలో వస్తున్న అనవసరపు లింకులను క్లిక్ చేయెుద్దని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఎర్రకుంట చెరువు ఆయకట్టులో వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు



సాగు జోరు..



జలకళతో కారేపలి పెద్ద చెరువు



అరకతో గొర్రు వేస్తూ.. మడులను సిద్ధం చేస్తున్న రైతు

- ముమ్మరంగా వరినాట్లు
- చిగురించిన ఆయకట్టు రైతుల ఆశలు
- మండలంలో 5వేల ఎకరాల్లో వరిసాగు
- నిండుకుండల్లా చెరువులు

కారేపల్లి: మండలంలో ఖరీఫ్ వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రైతులంతా పొలంబాట పట్టారు. వరినాట్లు వేయడంలో బీజీ అయ్యారు. గ్రామాల్లో ఏ పంటపొలం చూసినా రైతులు, కూలీలతో కళగా కనిపిస్తోంది. వర్షాలకు మండలంలోని పెద్ద, చిన్న చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. మరికొంత మంది రైతులు బావుల కింద వరిసాగు చేస్తున్నారు. ఈ ఏడాదికి తిండిగింజలకు కొదువ ఉండదని ఆశగా ఆయకట్టు రైతులు పొలం పనుల్లో నిమగ్నమాయ్యరు.

మండలంలో సాగు వివరాలిలా..

మండల వ్యాప్తంగా సుమారు 5వేల ఎకరాల ఆయకట్టులో రైతులు వరిసాగు చేస్తున్నారు. ఇప్పటికే సుమారు 2వేల ఎకరాల్లో నాట్లు వేయడం పూర్తికాగా.. మరో 3వేల ఎకరాల్లో నాట్లు వేసేందుకు రైతులు వరి మడులను సిద్ధం చేస్తున్నారు. వరి మడులకు దుగాలు చెక్కుతూ, అరకలతో గొర్రు వేస్తూ.. మరో పక్క ట్రాక్టర్లతో దమ్ము చేస్తున్నారు.

నిండుకుండల్లా చెరువులు..

కారేపల్లి మండలంలో బుగ్గవాగు, పులివాగు, కట్టువాగు, నల్లవాగులతో పాటు, చిన్న, పెద్ద కలిపి మొత్త 122 చెరువుల ఉన్నాయి. ఈ వర్షాలకు అవన్నీ నిండి నిండుకుండాలా కన్పిస్తుండటంతో రైతులు సాగుకు సన్నద్ధమయ్యారు. మరికొంత మంది రైతులు బావుల కింద వరి సాగు చేస్తున్నారు.

తిండి గింజలకు కొదువ లేదు..



ఈ ఏడాది తిండి గింజలకు కొదువ ఉండదు. నాకు అప్పాయిగూడెం చెరువు కింద ఎకరం పొలం ఉంది. ఈ పొలంలో పండించిన తిండి గింజలే మాకు ఏడాదంతా.. కడుపు నింపుతుంది. వానలు ఆలస్యం కావటంతో.. కుటుంబం అంతా దిగాలు చెందాము. కానీ, ఇప్పుడు వానలు రావటం, చెరువు అలుగు పడటంతో మా ఇంట్లో అందరు సంతోషించారు.
– బానోత్ బుచ్చా, ఆయకట్టు రైతు, భాగ్యనగర్‌తండా

గిట్టుబాటు ధర కల్పించాలి..



చెరువు నిండితేనే సాగు చేయాలి.. లేదంటే అంతే సంగతులు. అలాంటిది ఇటీవల కురిసిన వర్షాలకు సాగు పనులు చేపట్టాము. ప్రభుత్వం వరికి మద్దతు ధర పెంచి, అన్నదాతలకు ఆదుకోవాలి. లేదంటే.. తెచ్చిన పెట్టుబడికి, వచ్చిన దిగుబడికి సరికి సరి అయిపోతాయి. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తే..అన్నదాతలకు గట్టెక్కుతారు.
– తేజావత్ హచ్చా, ఆయకట్టు రైతు, భాగ్యనగర్‌తండా

ఇప్పటికే కొన్ని చెరువులు అలుగులు పోస్తున్నాయి. దీంతో చెరువుల కింద సాగుచేసే రైతులు తమ వరి మడులను సిద్ధం చేస్తున్నారు.

మరింత ఊతం..

వర్రెల్లో, వంపుల్లో, గుట్టల కింద, వాలు ప్రాంతాల్లో రైతులు చెలకలను పొలం మడులుగా చేసి.. వచ్చిపోయే వానలకు వర్షం నీళ్లను ఒడిసి పట్టుకుంటూ.. పండించే ఆకాశవాయి వరి రైతులకు ఈ చెదురుమదురు వానలు ఊతమిచ్చాయి. కారేపల్లి మండలంలో.. సుమారు 200 ఎకరాల్లో ఆకాశవాయిల కింద రైతులు వరిపంట సాగు చేస్తున్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

ముదిగొండ/తల్లాడ: వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, తల్లాడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కోడూరి నాగేశ్వరరావు తెలిపారు. ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో రహదారుల పక్కన, ఎంపీడీఓ కార్యాలయం ఎదుట, కమలాపురంలో, తల్లాడ మండలంలోని నారాయణపురం లూర్థుమాతా పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాటిన ప్రతీ మొక్కను ఎండిపోకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రంగనాయకమ్మ, పంచాయతీ కార్యదర్శులు రామకృష్ణ, లక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం ప్రసన్న, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ కో–ఆర్డినేటర్ లక్ష్మారెడ్డి, జోన్ చైర్మన్ ఆంజనేయులు, పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ సత్య, సిబ్బంది పాల్గొన్నారు.



ముదిగొండ: కమలాపురంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

ఉపాధి చట్టం బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఎర్రుపాలెం: ఉపాధిహామీ చట్టం బలోపేతానికి సంఘటితంగా కృషి చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్రా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వ్యవసాయ కార్మికుల సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధికూలీలకు 200రోజులు పనిదినాలు కల్పించి, కూలీ రూ.600 ఇవ్వాలన్నారు. అదే విధంగా బంజరలో చేపలవేటకు వెళ్లి మృతిచెందిన కుటుంబాలకు రూ.10లక్షలు, బీమవరంలో పాముకాటుకు గురైన ఫాతిమకు రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం నూతన మండల కమిటీ ఎన్నిక చేశారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గామాసు జోగయ్య, నాగులవంచ వెంకట్రామయ్యలను ఎన్నిక చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు తేలప్రోలు రాధాకృష్ణ, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య, నాయకులు తదితరులున్నారు.

చేయూత..

విద్యార్థులకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ..

కల్లూరురూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 6నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 503మంది విద్యార్థులకు బుధవారం విద్యార్థి గ్లోబల్ ఫౌండేషన్, సిద్దాస్‌కోడ్ హోప్ గ్లోబల్ సంస్థల సౌజన్యంతో జీపీఎఫ్ ట్రస్ట్ చైర్మన్ ఆళ్ల రంగారావు శానిటరీ ప్యాడ్స్‌లను పంపిణీ చేశారు. ఒక్కొక్క బాలికకు 9 ప్యాడ్లు అందచేశారు. అదే విధంగా సుమారు రూ. 67,500ల విలువగల ఇన్సూలేటర్ మిషన్లను పాఠశాలకు ఒకటి చొప్పున అందించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ పత్తిపాటి నివేదిత మాట్లాడుతూ.. జిల్లాలోనే ప్రథమంగా విద్యార్థులకు శానిటరీ ప్యాడ్లకు సంబంధించి ఇన్సూలేటర్ మిషన్లను అందించటం గొప్ప విషయమని, వారిని అభినందించారు. హెచ్‌ఎం మధు, మండల కోఆర్డినేటర్ వీర రాఘవయ్య, శ్రీనివాస్, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

మధిర: మధిర పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద బుధవారం నిరుపేదలకు అన్నదానం చేశారు. ముందుగా ఆలయంలో అర్చకులు హరి రవిశాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నారాయణ బెస్ట్ ఫౌండేషన్ స్కూల్ అధినేత బోనగిరి నారాయణరావు, వనజ దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అన్నదాన కమిటీ నిర్వాహకులు కోనా జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

దహనఖర్చులకు సాయం

వైరా: గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన కేశా కార్తీక్ నిరుపేద ఆర్యవైశ్యుడి దహనఖర్చుల నిమిత్తం ఆర్యవైశ్య మహాసభ పెద్దలు ఆర్థిక సాయం అందించారు. ఆర్యవైశ్య పెద్దలు వనమా విశ్వేశ్వరరావు, నూకల శ్రీనివాసరావులు మృతదేహాన్ని ఖమ్మం అన్నం ఫౌండేషన్ వారి సహకారంతో దహన సంస్కారాలు నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.6వేలు అందించారు. ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు మిట్టపల్లి కిరణ్, బాధ్యులు వెంకటరమణ, శివ, శంకర్, సందీప్, కృష్ణారావు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ తప్పనిసరి



చింతకాని : వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పిస్తున్న మేనేజర్ వెంకటరమణ

మధిర/చింతకాని: గర్భిణులు, పిల్లలకు అవసరమైన వ్యాక్సిన్లు వేయించేలా అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చందూనాయక్ సూచించారు. మధిర మండలం దెందుకూరు పీహెచ్‌సీ పరిధి మధిర–2 సబ్‌సెంటర్‌లో బుధవారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించాక ఆయన మాట్లాడారు. పుట్టిన బిడ్డ మొదలు ఐదేళ్లలోపు పిల్లలకు, గర్భిణులకు టీకాలు పూర్తి చేయాలని, వ్యాక్సిన్ల నిల్వలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఆతర్వాత మధిర ప్రభుత్వ ఆస్పత్రిని కూడా ఆయన పరిశీలించారు. వైద్యులు పృథ్వీరాజ్ నాయక్, రామ్మోహన్ నాయక్, ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే, చింతకాని మండల కేంద్రంతో పాటు కొదుమూరు, పందిళ్లపల్లిల్లో గ్రామాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ చింతల వెంకటరమణ పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే, తల్లి పాల ఆవశ్యకతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అంతేకాక ఈనెల 11న నులిపురుగుల మాత్రల పంపిణీపై సిబ్బందితో సమీక్షించారు. డాక్టర్ అల్తాఫ్, ఉద్యోగులు వీరేంద్ర, కృష్ణారావు, నాగేశ్వరరావు, రేచల్‌రాణి పాల్గొన్నారు.

ఆఫ్‌టైప్ మొక్కలపై ఉద్యమిద్దాం..

సత్తుపల్లిరూరల్: ఆయిల్‌పాం ఆఫ్‌టైప్ మొక్కలపై రైతులంతా ఐక్యంగా ఉద్యమిద్దామని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. సత్తుపల్లి మండలం కిష్టాపురంలో బుధవారం ఆయిల్‌పాం ఆఫ్‌టైప్ మొక్కల బాధితుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆఫ్‌టైప్ మొక్కలతో జరుగుతున్న నష్టాలను ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆరోపించారు. సమస్యపై మంత్రి తుమ్మల దృష్టి సారించాలని బీకేఎస్ జిల్లా అధ్యక్షులు రామారావు తెలుపగా.. పరిహారం వచ్చేలా ప్రభుత్వంపై పోరాడాలని పామాయిల్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుంబూరు మహేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పుల్లయ్య, రాజబాబు, రమేష్, శ్రీనివాస్, కృష్ణమూర్తి, శ్రీరాములు, సూరిబాబు, వెంకట్రావ్ పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చేది బీజేపీనే..

ఎర్రుపాలెం: తెలంగాణలో బీజేపీకే భవిష్యత్ ఉందని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో భారతీయ జనతా పార్టీ మహాసంపర్క అభియాన్, ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాని లాంఛనంగా ఆయన ప్రారంభించారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరసింహరావు, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారావు, నాయకులు తదితరులున్నారు.

ఎన్నికల్లో కీలక పాత్ర పోషించాలి

చింతకాని: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ కీలక పాత్ర పోషించాలని పార్టీ ఖమ్మం పార్లమెంట్ టీడీపీ అడహక్ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం పేర్కొన్నారు. బుధవారం చింతకాని టీడీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించని పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ పోటీచేసే స్థానాల్లో అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా నాయకులు హరీష్ చంద్ర, తెలుగు రైతు మాజీ అధ్యక్షుడు సుధాకర్, టీడీపీ చింతకాని, బోనకల్ మండల అధ్యక్షులు తేలుకుంట్ల శ్రీనివాసరావు, రావుట్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు నన్నక రామారావు, కోశాధికారి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



కల్లూరురూరల్: గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



సత్తుపల్లిరూరల్: బుగ్గపాడులో..

బోనకల్/ సత్తుపల్లిరూరల్/ వేంసూరు/కల్లూరు రూరల్: బోనకల్ మండలంలోని ముష్టికుంట్ల, బోనకల్ గ్రామాల్లో, సత్తుపల్లిరూరల్ మండలంలోని బుగ్గపాడు గ్రామంలో, ఐసీడీఎస్ కల్లూరు ప్రాజెక్టు పరిధిలోని కప్పలబంధం, ముచ్చవరం గ్రామాల్లో, వేంసూరులోని.. బీరపల్లిలో తల్లిపాల వారోత్సవాలు బుధవారం ఘనంగాఇ నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, సుజాత, సెక్టార్ సూపర్‌వైజర్ భవాని, హెల్త్ సూపర్‌వైజర్ శారీరాణి మాట్లాడుతూ.. తల్లిపాలు అత్యంత శ్రేష్టమైనవని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రూప, ప్రభుత్వ ఉపాధ్యాయులు చాంద్‌సాహెబ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పలువురిపై కేసులు నమోదు

వైరా: వైరా పట్టణంలోని పలు కాలనీల్లో రహదారులకు అడ్డంగా ఇసుక, కంకర, ఇతర వస్తువులు ఉంచి ప్రజలకు వాహనాల రాక పోకలకు ఆటంకం కలిగిస్తున్న పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పి.రామారావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని హనుమాన్ బజార్, సత్రంబజార్, గాంధీ నగర్‌లోని వివిధ కాలనీలో ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్న వారు సామగ్రి రోడ్డుపైనే ఉంచి రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నారని ఈ సందర్భంగా 10మందిపై సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

పెట్రోల్‌లో కల్తీ జరిగిందని ఆందోళన

సత్తుపల్లి: పెట్రోల్ బంక్‌ల్లో నీళ్లు కలిసిన పెట్రోల్ వస్తోందని సత్తుపల్లి వాసులు పలువురు ఆరోపించారు. సత్తుపల్లి రామాలయం ఎదురుగా ఉన్న పెట్రోల్‌బంక్, గంగారం బెటాలియన్ బంక్‌ల్లో ఇలా జరుగుతోందని గంగారం ప్రకాష్‌నగర్‌కాలనీకి చెందిన కువ్వారపు లక్ష్మణ్‌రావు, సత్తుపల్లికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి షేక్ మన్సూర్ అలీ బుధవారం వెల్లడించారు. ఈమేరకు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏన్కూరు: ఏన్కూరు మండల కేంద్రంలో బుధవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఎస్సై రఫీ తెలిపిన వివరాలు... మణుగూరు నుండి ఖమ్మం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ఖమ్మం నుండి కొత్తగూడెం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఏన్కూరులో ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న రవితేజ, అఖిల్‌రెడ్డికి గాయాలు కాగా 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులు హైదరాబాద్ వాసులు కాగా, కొత్తగూడెం వైపు వెళ్తున్నట్లు తెలిసింది.

అత్తను కొట్టిన అల్లుడిపై కేసు

చింతకాని: మండలంలోని కొదుమూరుకు చెందిన గాడుదల మల్లయ్యపై బుధవారం కేసు నమోదైంది. ఆయన మంగళవారం రాత్రి తన భార్యతో గొడవ పడుతుండగా, అడ్డుగా వెళ్లిన అత్త నక్కన బోయిన విజయమ్మ తలపై కర్రతో కొట్టడంతో గాయమైంది. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

సంక్షిప్త సమాచారం

కారేపల్లిలో ఘనంగా బోనాలు



ముత్యాలమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు

కారేపల్లి: కారేపల్లిలో బుధవారం బోనాల వేడుకను ఘనంగా నిర్వహించారు. కారేపల్లిలోని బీసీ కాలనీ, యాదవ్‌నగర్, బొడ్రాయిసెంటర్, గణేష్ సెంటర్, లాడీస్ బజార్, భారత్‌నగర్, మేదర బజార్‌లకు చెందిన మహిళా భక్తులు బోనాలను నెత్తిన పెట్టుకొని ప్రదర్శనగా మేళతాళాల నడుమ ముత్యాలమ్మ గుడి వద్దకు చేరుకున్నారు. అనంతరం ముత్యాలమ్మ తల్లికి బోనం చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు.

పెన్షన్ ఏరియర్స్ కోసం ఎదురుచూపులు

మధిర: మండలంలోని మహదేవపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు పెండింగ్‌లో ఉన్న పెన్షన్ డబ్బు కోసం ఎదురుచూస్తున్నారు. గ్రామానికి చెందిన వాసిరెడ్డి శ్రీరామ్మూర్తి 1981లో వీడీఓగా పనిచేస్తూ గుండెపోటుతో మృతి చెందాడు. ఆతర్వాత ఆయన భార్య లీలావతికి మంజూరు చేయగా, అనారోగ్య కారణాలతో 2014 – 2019 మధ్య లైఫ్ సర్టిఫికెట్ బ్యాంకులో సమర్పించలేదు. దీంతో ఐదేళ్ల ఏరియర్స్ రూ. 5.74 లక్షల పెండింగ్‌పడగా, ఖమ్మం, భద్రాద్రి కలెక్టరేట్లకు తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని లీలావతి వాపోయింది. తన భర్త చివరిసారిగా పనిచేసిన సుదిమళ్లలో క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకొస్తేనే ప్రతిపాదిస్తామని కొత్తగూడెం సబ్‌ట్రెజరీ ఉద్యోగులు కొర్రీలు పెడుతున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని ఆమె బుధవారం ఓ ప్రకటనలో కోరారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో వైరా

వైరా: వైరా మున్సిపాలిటీ ఏర్పడి దాదాపుగా 7సంవత్సరాలు కావొతున్నప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉందని వైరా మాజీ ఎంపీపీ బొంతు సమత అన్నారు. బుధవారం వైరా సుందరయ్య నగర్ నిర్వహించిన సీపీఎం శాఖా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు కనీస సౌకర్యాలు అయిన డ్రైయినేజీ, వీధి దీపాలు, పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులో లేక తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో శాఖా కార్యదర్శి నాగుల్‌పాషా, సీపీఎం సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఏ)గ్రామానికి చెందిన పొదుపు మహిళా సంఘాల సభ్యులు.. తమ గ్రూపుల్లో నిధులు అవకతవకలు జరిగాయని వాటిపై విచారణ చేపట్టాలని బుధవారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గ్రూపు సభ్యుల వద్ద పొంతన లేకుండా డబ్బులు వసూలు చేస్తూ సీసీ, గ్రామదీపికలు తప్పుడు లెక్కలు రాస్తూ అధిక మొత్తంలో డబ్బులను కాజేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేసి తమకు న్యాయం చేయాలని గ్రూపు సభ్యులు కోరారు. ఈ విషయమై ఏపీఎం కొట్టి వెంకటేశ్వర్లను వివరణ కోరగా పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని తెలిపారు.

11న జాతీయ నులి పురుగుల దినోత్సవం

తల్లాడ: ఈ నెల 11న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వైద్యాధికారి ప్రత్యూష అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది నుంచి 19 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వేయనున్నట్లు పేర్కొన్నారు. తమ పిల్లలను పాఠశాలలకు పంపించి ఈ మాత్రలు వేయించుకోవాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి, శివ పాల్గొన్నారు.

న్యూలిటిల్ ఫ్లవర్స్ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన బాల బాలికలతో పాఠశాల యాజమాన్యం

వైరా: ఖమ్మం గాంధీచౌక్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించిన జాతీయస్థాయి ఆల్ స్టైల్ కరాటే, కుంపూ ఛాంపియన్‌షిప్–2025లో వైరా శాంతిన గర్‌లోని న్యూలిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు వివిధ కేటగిరీల్లో పాల్గొని ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ షాజీ మాథ్యూ, ఏఓ నరసింహారావు పాల్గొన్నారు.


సీపీఐ నాయకుల నివాళులు

చింతకాని: మండలంలోని రాఘవాపురం గ్రామంలో సీపీఐ సీనియర్ నాయకురాలు వడ్డే వజ్రమ్మ (60) అనారోగ్యంతో మృతి చెందింది. మృతదేహాన్ని బుధవారం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, నాయకులు మోహన్‌రావు, సత్యనారాయణ, రవి సందర్శించి నివాళులర్పించారు.

మహిళా గురుకులంలో ఎన్నికలు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలోని గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో 2025–26 సంవత్సరానికి గాను స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు బుధవారం నిర్వహించారు. మొత్తం 11 విభాగాల్లో ఎన్నికలు నిర్వహించగా చైర్మన్, సెక్రటరీ, తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నుకోబడ్డ బాలికలను కళాశాల ప్రిన్సిపాల్ కె.రజని, వైస్ ప్రిన్సిపాల్ నవ్య, అభినందించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల కోఆర్డినేటర్లు కేపీ ఐశ్వర్య, దీప్తి అధ్యాపక బృందం పాల్గొన్నారు.

వాసవీ గణపతి నవరాత్రి ఉత్సవాల చైర్మన్‌గా వందనపు




వందనపు సత్యనారాయణ


సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి శ్రీకోదండ రామాలయం ఆవరణ వర్తక సంఘం ప్రాంగణంలో ఆగస్ట్ 27 నుంచి సెప్టెంబర్ 6 వరకు నిర్వహించే 16వ వాసవీ గణపతి నవరాత్రి ఉత్సవాల సన్నాహక సమావేశంలో ఉత్సవ చైర్మన్‌గా వందనపు సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవరాత్రి ఉత్సవాలను సత్తుపల్లి మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘాలు, వాసవిక్లబ్ సత్తుపల్లి గ్రేటర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 17వ తేదీ ఉదయం 11.46 గంటలకు భూమిపూజకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికులు ముందస్తు అరెస్ట్


కల్లూరు: సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఖమ్మం కలెక్టరేట్‌కు ధర్నాలో పాల్గొనేందుకు వెళ్తుండగా బుధవారం ఉదయం ఎస్ఐ డి.హరిత సమక్షంలో పోలీసులు ఆరుగురు కార్మికులను అరెస్ట్ చేశారు.



మధిర: జయశంకర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు



వైరా: నివాళులర్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది



బోనకల్: నివాళులర్పిస్తున్న జెడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు, నాయకులు

ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



సత్తుపల్లిరూరల్: జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బెటాలియన్ కమాండెంట్ ఎన్.పెదబాబు, అధికారులు



సత్తుపల్లిటౌన్: మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కమిషనర్ నర్సింహా, ఉద్యోగులు

తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితో ముందుకు సాగాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యాసంస్థల్లో జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. జయశంకర్ మంచి విద్యావేత్త అని, తెలంగాణ సిద్ధాంతకర్తగా పేరుపొందారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్లారా చూడాలని ఉందని తరచుగా చెప్పిన జయశంకర్ 2011 జూన్ 21న ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందే మరణించారని.. కాబట్టి అటువంటి మహనీయుల ఆశయ సాధనకై మనమందరం కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్